# యువ వెలుగు

PRGI: TGTEL/26/A6429

E- Paper, www.yuvavelugu.com

తెలుగు దిన పత్రిక

సంపుటి : 01 సంచిక : 34 | ప్రచురణ : రంగారెడ్డి | ఎడిటర్ : పి. మహేష్ గౌడ్ | బుధవారం 07-10-2026 | పేజీలు : 4 ధర :- 02/-


## భారత వాయుసేన నూతన అధిపతిగా అశుతోష్ దీక్షిత్

ప్రస్తుతం వైస్ చీఫ్‌గా ఉన్న దీక్షిత్‌కు పదోన్నతి

అక్టోబర్ 31న పదవీ విరమణ చేయనున్న అమర్ ప్రీత్ సింగ్



3,500 గంటలకు పైగా ఫైటర్ జెట్ నడిపిన అనుభవం

త్రివిధ దళాల సమన్వయం, ఆధునికీకరణపై దృష్టి

2


తెలుగు దిన పత్రికలో పని చేయుటకు

రిపోర్టర్లు కావలెను

మండలం | నియోజకవర్గం | జిల్లా వారీగా రిపోర్టర్లు కావలెను

9908502602




## ఓట్ల తొలగింపుపై ప్రశ్నిస్తే అరెస్టులా ..?

కేంద్రం తీరుపై మంత్రి పొన్నం ఫైర్..!

రాహుల్, ప్రియాంకల అరెస్టు అప్రజాస్వామికం

గ్రామాల్లో 'దేశ్ బచావో.. ఓట్ బచావో' ఉద్యమం

**హుస్నాబాద్, యువ వెలుగు, సెప్టెంబర్ 06 :** ప్రజాస్వామ్యంలో ఓటు అనేది ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కని, దాన్ని కాలరాయాలని చూస్తే చూస్తూ ఊరుకోబోమని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం కోహెడ, శ్రీరాములపల్లిలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఓటర్ల జాబితా సవరణ పేరిట గ్రామీణ ప్రాంతాల్లోని పేదలు, అర్హులైన ఓట్లను ...(మిగతా 2లో)

## కొత్త స్టీల్ బ్రిడ్జికి తెలంగాణ సర్కార్ గ్రీన్ సిగ్నల్

### కేబీఆర్ పార్క్ చుట్టూ ఫ్లైఓవర్లు రద్దు

- కొత్తగా స్టీల్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం
- ఈ నిర్ణయంతో ప్రభుత్వానికి సుమారు రూ. 1200 కోట్ల ఆదా
- కేబీఆర్ పార్క్ చుట్టూ వన్-వే ట్రాఫిక్ విధానం శాశ్వతం
- వచ్చే ఏడాదికల్లా కొత్త వంతెన పూర్తి చేస్తామన్న జీహెచ్ఎంసీ



**హైదారాబాద్, యువ వెలుగు, సెప్టెంబర్ 06 :** హైదరాబాద్‌లోని కేబీఆర్ నేషనల్ పార్క్ చుట్టూ గతంలో ప్రతిపాదించిన బహుళ ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల ప్రాజెక్టును తెలంగాణ ప్రభుత్వం రద్దు చేసింది. వాటి స్థానంలో సరికొత్తగా డిజైన్ చేసిన ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో సుమారు రూ. 1,200 కోట్ల ప్రజాధనం ఆదా కానుంది. సవరించిన ప్రణాళిక ప్రకారం, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి ముఫఖంజా కాలేజీ వరకు ఆరు లేన్ల స్టీల్ ఎలివేటెడ్ కారిడార్ (స్టీల్ బ్రిడ్జి) నిర్మించనున్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం.1 వైపు వెళ్లేందుకు వీలుగా దీనికి ఒక ర్యాంప్‌ను కూడా అనుసంధానిస్తారు. గతంలో ఈ పనులకు సంబంధించి కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్స్‌కు ఇచ్చిన 'లెటర్ ఆఫ్ అవార్డు'ను ఉపసంహరించుకుని, కొత్త డిజైన్ బాధ్యతలను మేఘా ఇంజినీరింగ్‌కు అప్పగించారు. భూసేకరణ వ్యయం తగ్గడం వల రూ. 800 కోట్లు, నిర్మాణ ఖర్చు తగ్గడం వల్ల మరో రూ. 400 కోట్లు కలిపి మొత్తం రూ.1200 కోట్లు ఆదా అవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ప్రాజెక్టుపై జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ మాట్లాడుతూ, కేబీఆర్ పార్క్ చుట్టూ గతంలో తలపెట్టిన హెచ్-సిటీ పనులను రద్దు చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న వన్-వే విధానం సత్ఫలితాలను ఇస్తుండటంతో దానినే శాశ్వతం చేస్తున్నట్లు పేర్కొన్నారు. దీనివల్ల పెద్ద మొత్తంలో ప్రజాధనం ఆదా అవుతుందని, నాగార్జున సర్కిల్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు ...(మిగతా 2లో)

## దక్షిణ రాష్ట్రాల్లో సైబర్ సెక్యూరిటీ బ్యూరో భారీ ఆపరేషన్

- సైబర్ నేరగాళ్లకు మ్యూల్ ఖాతాలు అందిస్తున్న 100 మందికి పైగా అరెస్ట్
- ఏపీ, తెలంగాణ సహా ఐదు రాష్ట్రాల్లో ఏకకాలంలో సోదాలు
- హైదరాబాద్ డాక్టర్‌ను మోసం చేసి రూ.11 కోట్లు కాజేసిన కేసులో దర్యాప్తు
- దుబాయ్, ఇతర దేశాల్లోని నేరగాళ్లతో సంబంధాలపై అధికారుల ఆరా



**హైదారాబాద్, యువ వెలుగు, సెప్టెంబర్ 06 :** సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్న ముఠాలపై సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఉక్కుపాదం మోపింది. గత రెండు వారాలుగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా పలు దక్షిణ రాష్ట్రాల్లో చేపట్టిన మెగా ఆపరేషన్‌లో 100 మందికి పైగా ఏజెంట్లను అరెస్టు చేసింది. సైబర్ మోసగాళ్లకు 'మ్యూల్' బ్యాంకు ఖాతాలు, కేవైసీ పత్రాలు సరఫరా చేస్తున్నారనే ఆరోపణలపై వీరిని అదుపులోకి తీసుకున్నారు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో బ్యూరో ప్రత్యేక బృందాలు సోదాలు నిర్వహించాయి. నిందితుల నుంచి మ్యూల్ ఖాతాలకు సంబంధించిన డెబిట్ కార్డులు, బ్యాంకు పాస్‌బుక్‌లను స్వాధీనం చేసుకున్నారు. దేశవ్యాప్తంగా నమోదైన అనేక సైబర్ క్రైమ్ కేసులతో ఈ నెట్‌వర్క్‌కు సంబంధాలు ఉన్నట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. ఇటీవల హైదరాబాద్‌కు చెందిన ఓ వైద్యుడిని మోసం చేసి రూ. 11 కోట్లు కాజేసిన కేసు దర్యాప్తులో ఈ అరెస్టులు కీలకంగా మారాయి. బాధితుడి నుంచి దోచుకున్న డబ్బును ఈ మ్యూల్ ఖాతాల్లోకే బదిలీ చేసినట్లు అధికారులు గుర్తించారు. అరెస్ట్ అయిన వారందరినీ ట్రాన్సిట్ వారెంట్లపై హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. ఈ మోసాల వెనుక దుబాయ్, ఇతర దేశాల్లోని సైబర్ నేరగాళ్ల హస్తం ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు.

ఆన్‌లైన్ మోసాల ద్వారా సంపాదించిన డబ్బును దాచిపెట్టడానికి, తరలించడానికి సైబర్ నేరగాళ్లు ఈ మ్యూల్ ఖాతాలను ఉపయోగిస్తుంటారు. ఫిషింగ్, పెట్టుబడి మోసాల ద్వారా కొల్లగొట్టిన డబ్బును అసలు సూత్రధారులెవరో తెలియకుండా చేసేందుకు ఈ ఖాతాలు మాధ్యమంగా పనిచేస్తాయి. ఈ కేసులో మరింత లోతుగా దర్యాప్తు చేసి, ప్రధాన నిందితులను గుర్తించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు.

## మాజీ మావోయిస్టులను తమ పార్టీలోకి ఆహ్వానించిన కవిత



**హైదారాబాద్, యువ వెలుగు, సెప్టెంబర్ 06 :** తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఈరోజు వేములవాడలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జనజీవన స్రవంతిలో కలిసిన మాజీ మావోయిస్టులు ప్రజాసేవ చేసేందుకు తమ పార్టీలో చేరాలని ఆహ్వానించారు. వారి రాకతో తమ పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. పర్యటనలో భాగంగా, వేములవాడ రాజన్న ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను కవిత ...(మిగతా 2లో)

## బార్ల యజమానులకు నష్టం లేదు

### వినియోగదారులపై స్వల్ప భారం: మంత్రి జూపల్లి

- ప్రివిలేజ్ ఫీజుతో బార్ల యజమానులకు నష్టం లేదన్న మంత్రి జూపల్లి
- వినియోగదారులపై పడేది స్వల్ప భారమేనని స్పష్టీకరణ
- బీఆర్ఎస్ హయాంలో మద్యం ఆదాయం 260 శాతం పెరిగిందని వెల్లడి



**హైదారాబాద్, యువ వెలుగు, సెప్టెంబర్ 06 :** రాష్ట్రంలో కొత్తగా ప్రతిపాదించిన ప్రివిలేజ్ ఫీజు వల్ల బార్ల యజమానులకు ఎలాంటి నష్టం జరగదని, ...(మిగతా 2లో)



## ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డికి బెయిల్.. జైలు నుంచి విడుదల

- లైంగిక వేధింపుల కేసులో ట్రైనీ ఐపీఎస్‌కు బెయిల్
- 67 రోజుల తర్వాత జైలు నుంచి ఉదయ్ కృష్ణారెడ్డి విడుదల
- షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిన ఉప్పరపల్లి కోర్టు
- సహచర మహిళా అధికారి ఫిర్యాదుతో గతంలో అరెస్ట్

**హైదారాబాద్, యువ వెలుగు, సెప్టెంబర్ 06 :** లైంగిక వేధింపుల ఆరోపణల కేసులో అరెస్టయిన ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డికి ఊరట లభించింది. సుమారు 67 రోజులుగా జైల్లో ఉన్న ఆయనకు హైదరాబాద్‌లోని ఉప్పరపల్లి కోర్టు మంగళవారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. దీంతో ఆయన చర్లపల్లి జైలు నుంచి విడుదలయ్యారు. గతంలో ఉదయ్ కృష్ణారెడ్డి తనను లైంగికంగా వేధిస్తున్నారని ఆరోపిస్తూ, ఆయన సహచర మహిళా ఐపీఎస్ అధికారి అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు ...(మిగతా 2లో)

## ఫేక్ సర్టిఫికెట్ల బాగోతం: తెలంగాణలో 35 మంది ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల తొలగింపు



- తెలంగాణలో 35 మంది ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల తొలగింపు
- నకిలీ విద్యార్హత సర్టిఫికెట్లు సమర్పించారని నిర్ధారణ
- కాంట్రాక్టు నుంచి రెగ్యులరైజ్ అయ్యాక వెలుగులోకి బాగోతం
- మరో 320 మంది లెక్చరర్ల సర్టిఫికెట్లపై కొనసాగుతున్న విచారణ
- ఈ వ్యవహారంపై సీబీ-సీఐడీ విచారణకు జేపీసీ డిమాండ్

**హైదారాబాద్, యువ వెలుగు, సెప్టెంబర్ 06 :** తెలంగాణలో నకిలీ విద్యార్హత సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన 35 మంది ప్రభుత్వ జూనియర్ లెక్చరర్లను ఇంటర్మీడియట్ విద్యాశాఖ విధుల నుంచి తొలగించింది. వారు సమర్పించిన సర్టిఫికెట్లు నకిలీవని ధ్రువీకరణ కావడంతో ఈ కఠిన చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

వివరాల్లోకి వెళితే, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మొదట కాంట్రాక్టు లెక్చరర్లుగా పనిచేసిన వీరందరినీ 2023లో ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసింది. అయితే, వారి విద్యార్హత పత్రాలపై అనుమానాలు రావడంతో ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఆ సర్టిఫికెట్లను సంబంధిత విశ్వవిద్యాలయాలకు వెరిఫికేషన్ కోసం పంపింది. పరిశీలన అనంతరం ఆ సర్టిఫికెట్లు నకిలీవని యూనివర్సిటీలు తేల్చి చెప్పాయి. దీంతో విద్యాశాఖ ...(మిగతా 2లో)

## మేడిపల్లిలో భారీ దోపిడీ

### 11 నిమిషాల్లో రూ.2.5 కోట్లు లూటీ!




- క్యారెట్‌లేన్ షోరూంలో భారీ చోరీ
- ఏడుగురు దుండగులు పక్కా ప్రణాళికతో దోపిడీ
- బిహార్‌కు చెందిన ముఠా పనేనని అనుమానం
- పాత ఉద్యోగుల ప్రమేయంపై కూడా పోలీసుల విచారణ

2

## భూమికి బదులుగా అభివృద్ధి చేసిన ప్లాట్లు

### తెలంగాణలో కొత్త ల్యాండ్ పూలింగ్ పాలసీ?

- తెలంగాణలో రాష్ట్రవ్యాప్త ల్యాండ్ పూలింగ్‌కు కొత్త పాలసీ తెచ్చే యోచన
- భూమికి బదులుగా అభివృద్ధి చేసిన ప్లాట్లు ఇవ్వాలని ప్లాన్
- మూసీ, హెచ్ఎండీఏ ప్రాజెక్టుల్లో ఇప్పటికే అమలు
- పట్టా భూముల యజమానులతో పాటు ఇతర భూములకు కూడా ప్రయోజనం
- స్వచ్ఛందంగా పూలింగ్‌తో పాటు ప్రభుత్వమూ చేపట్టేలా విధానం



**హైదారాబాద్, యువ వెలుగు, సెప్టెంబర్ 06 :** భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులకు భూసేకరణ ఖర్చు పెరుగుతున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. భూములు తీసుకుని డబ్బులు చెల్లించే విధానానికి బదులుగా.. భూయజమానులకు అభివృద్ధి చేసిన ప్లాట్లు ఇచ్చేలా రాష్ట్రవ్యాప్తంగా కొత్త ల్యాండ్ పూలింగ్ విధానాన్ని తీసుకురానున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం మూసీ ప్రక్షాళన, హెచ్ఎండీఏ, హెచ్‌జీసీఎల్ పరిధిలోని కొన్ని ప్రాజెక్టుల్లో ఈ విధానం అమలవుతోంది. అక్కడ మంచి ఫలితాలు వస్తే రాష్ట్రంలోని సాగునీరు, రహదారులు, భవనాలు సహా వివిధ శాఖల ప్రాజెక్టులకు దీనిని విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం తెలంగాణ సమగ్ర ప్రాంత అభివృద్ధి, ప్రణాళిక బిల్లు-2026ను ప్రభుత్వం సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ విధానం అమల్లోకి వస్తే హెచ్ఎండీఏ, పట్టణాభివృద్ధి ...(మిగతా 2లో)

## సీఎం రేవంత్ రెడ్డి కుటుంబంపై ఆరోపణలు: బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ అరెస్ట్

- సికింద్రాబాద్ మెడికవర్ ఆసుపత్రి వద్ద బ్యానర్లు ఏర్పాటు చేశారన్నది ప్రధాన ఆరోపణ
- ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకే అరెస్ట్ చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శ
- ఈ ఆరోపణలు నిరాధారమైనవని కొట్టిపారేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం



**హైదారాబాద్, యువ వెలుగు, సెప్టెంబర్ 06 :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబంపై ఆరోపణలు చేస్తూ వివాదాస్పద బ్యానర్లు ఏర్పాటు చేసిన కేసులో భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నేత, ఆ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్‌ను గోపాలపురం పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. సికింద్రాబాద్‌లోని మెడికవర్ ఆసుపత్రి వద్ద అభ్యంతరకర రీతిలో బ్యానర్లు ప్రదర్శించారన్న అభియోగంపై ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాల ప్రకారం, మెడికవర్ ఆసుపత్రికి సంబంధించి రూ. 13,200 కోట్ల మేర ఆర్థిక లావాదేవీలు జరిగాయని ఆరోపిస్తూ క్రిశాంక్ తన అనుచరులతో కలిసి ఆసుపత్రి వెలుపల బ్యానర్లు ఏర్పాటు చేసినట్లు పోలీసులు గుర్తించారు. ముఖ్యమంత్రి చిత్రపటాన్ని ఉపయోగిస్తూ, ఆయనకు అభినందనలు తెలుపుతున్నట్లుగా వ్యంగ్యంగా వీటిని రూపొందించారు. ...(మిగతా 2లో)



## ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డికి బెయిల్

(మొదటి పేజీ తరువాయి)

మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు అనంతరం ఉదయ్ కృష్ణారెడ్డిని అరెస్ట్ చేశారు. అనంతరం అతడిని కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. అప్పటి నుంచి ఆయన చర్లపల్లి జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. తాజాగా ఈ కేసులో విచారణ జరిపిన ఉప్పరపల్లి కోర్టు, ఆయనకు బెయిల్ మంజూరు చేయడంతో జైలు నుంచి బయటకు వచ్చారు.

## ఫేక్ సర్టిఫికెట్ల బాగోతం: తెలంగాణలో 35 మంది ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల తొలగింపు

(మొదటి పేజీ తరువాయి)

సదరు లెక్చరర్లకు షో-కాజ్ నోటీసులు జారీ చేసి, వారి వివరణ తీసుకున్న తర్వాత సర్వీస్ నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఉద్యోగాలు కోల్పోయిన వారిలో రాజన్న-సిరిసిల్ల జిల్లా నుంచి ఆరుగురు ఉండగా, పెద్దపల్లి, సిద్దిపేట, సూర్యాపేట జిల్లాల నుంచి ముగ్గురు చొప్పున ఉన్నారు. భద్రాద్రి కొత్తగూడెం, కరీంనగర్, ఖమ్మం, నిర్మల్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల నుంచి ఇద్దరేసి లెక్చరర్లు ఉన్నారు. మరో ఎనిమిది జిల్లాల నుంచి ఒక్కొక్కరు చొప్పున ఈ జాబితాలో ఉన్నారు. ఇదే తరహా ఆరోపణలపై గతంలో సుమారు 10 మంది లెక్చరర్లను తొలగించినట్లు సమాచారం. ప్రస్తుతం మరో 320 మంది లెక్చరర్ల సర్టిఫికెట్లను కూడా వెరిఫికేషన్ కోసం యూనివర్సిటీలకు పంపినట్లు అధికారులు వెల్లడించారు. ఇదిలా ఉండగా, ఈ వ్యవహారంపై సీబీ-సీఐడీ, విజిలెన్స్ విచారణ జరిపించాలని ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఛైర్మన్ డాక్టర్ పి. మధుసూదన్ రెడ్డి డిమాండ్ చేశారు. గతంలో ఈ నకిలీ పత్రాలను పరిశీలించి, ధ్రువీకరించిన అధికారుల పాత్రపై కూడా విచారణ జరపాలని ఆయన కోరారు. మోసం రుజువైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## బార్ల యజమానులకు నష్టం లేదు

(మొదటి పేజీ తరువాయి)

వినియోగదారులపై మాత్రమే స్వల్ప భారం పడుతుందని తెలంగాణ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. ప్రివిలేజ్ ఫీజును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బార్స్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్ చేపట్టిన నిరసనలపై ఆయన స్పందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... మద్యం ధరలు పెంచడం వల్ల ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుందే తప్ప, వినియోగం పెద్దగా తగ్గదని గత అనుభవాలు చెబుతున్నాయన్నారు. హైదరాబాద్ నగరం అప్‌గ్రేడ్ అయినందున, ఇతర రాష్ట్రాల్లో ఉన్న విధంగానే ఇక్కడా బార్ లైసెన్సులను జారీ చేశామని తెలిపారు. ఈ కొత్త రుసుము బార్ యాజమాన్యాలకు నష్టం కలిగించేది కాదని ఆయన పునరుద్ఘాటించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మద్యం ద్వారా వచ్చే ఆదాయం రూ.10,000 కోట్ల నుంచి రూ.36,000 కోట్లకు, అంటే దాదాపు 260 శాతం పెరిగిందని జూపల్లి గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మద్యం ఆదాయం ప్రస్తుతం రూ.40,000 కోట్లుగా ఉందని వివరించారు. ప్రభుత్వం చట్ట ప్రకారమే ముందుకు వెళుతోందని, మద్యం ఉత్పత్తికి నీటి కొరత ఏమీ లేదని ఆయన పేర్కొన్నారు.

## ఓట్ల తొలగింపుపై ప్రశ్నిస్తే అరెస్టులా ..?

(మొదటి పేజీ తరువాయి)

అక్రమంగా తొలగిస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా వ్యవహరించకుండా కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లో పనిచేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని విమర్శించారు. ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు, ఈసీ అక్రమాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను పోలీసులు అరెస్టు చేయడాన్ని మంత్రి తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళన చేసే హక్కును కూడా కేంద్రం లాక్కుంటోందని ధ్వజమెత్తారు. దేశవ్యాప్తంగా ప్రతిపక్షాలు ముక్తకంఠంతో ఈసీ వైఖరిని ఎండగడుతున్నా మోదీ సర్కారు నిరంకుశంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. గ్రామీణ స్థాయి నుంచి ప్రతి ఓటరు హక్కును కాపాడేందుకు 'దేశ్ బచావో.. ఓట్ బచావో' పేరిట పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

## కొత్త స్టీల్ బ్రిడ్జికి తెలంగాణ సర్కార్ గ్రీన్ సిగ్నల్

(మొదటి పేజీ తరువాయి)

ఆరు లేన్ల స్టీల్ బ్రిడ్జిని నిర్మించి, వచ్చే ఏడాది నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. పర్యావరణ సున్నిత ప్రాంతంలో చెట్ల నరికివేతపై కోర్టు ఆంక్షల కారణంగా పాత ప్రాజెక్టు పనుల్లో జాప్యం జరిగింది. మాదాపూర్, హైటెక్ సిటీ వైపు వెళ్లే వాహనదారులకు సిగ్నల్-ఫ్రీ ప్రయాణాన్ని కల్పిస్తూనే, పార్క్‌లోని పచ్చదనానికి కనీస నష్టం కలగకుండా ఈ సరికొత్త కారిడార్‌ను ప్రభుత్వం రూపొందించింది.

## భారత వాయుసేన నూతన అధిపతిగా అశుతోష్ దీక్షిత్

**న్యూఢిల్లీ :** భారత వైమానిక దళం (ఐఏఎఫ్) నూతన అధిపతిగా ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం మంగళవారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుతం వైస్ చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన, అక్టోబర్ 31న పదవీ విరమణ చేయనున్న ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ స్థానంలో బాధ్యతలు చేపట్టనున్నారు. దీనితో ఆయన భారత వాయుసేనకు 29వ అధిపతిగా నిలవనున్నారు. నైపుణ్యం కలిగిన ఫైటర్ పైలట్ అయిన అశుతోష్ దీక్షిత్‌కు 3,500 గంటలకు పైగా యుద్ధ విమానాలను నడిపిన అపార అనుభవం ఉంది. ఆయన 1986 డిసెంబర్ 6న ఐఏఎఫ్ ఫైటర్ విభాగంలో కమిషన్ పొందారు. తన సుదీర్ఘ వృత్తి జీవితంలో మిరాజ్-2000, మిగ్ వేరియంట్లు, జాగ్వార్, కిరణ్, హాక్, తేజస్ వంటి అనేక రకాల యుద్ధ విమానాలను నడిపారు.

# ఎమ్మెల్యే యశస్విని సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన బిఆర్ఎస్ నాయకులు



**జనగామ జిల్లా, యువ వెలుగు, సెప్టెంబర్ 06 :** దేవరుప్పుల మండలం,ధర్మగడ్డ తండాలో బీఆర్ఎస్‌కు చెందిన వార్డు సభ్యులు,పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు స్థానిక కాంగ్రెస్ నాయకులు తెలిపారు.గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, సర్పంచ్ అభ్యర్థి మూడ చందన దేవేందర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని పేర్కొన్నారు. అన్ని వర్గాల సంక్షేమంతో పాటు గ్రామాలు, తండాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. అనంతరం ధర్మగడ్డ తండాలో నెలకొన్న పలు సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులను వివరిస్తూ మూడ దేవేందర్ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.తండాలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేయడంతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.సమస్యలను పరిశీలించి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో వార్డు సభ్యురాలు భూక్య బికినీతో పాటు భూక్య శ్రీనివాస్, భూక్య సోమ్లా, బానోత్ శ్రీనివాస్, మూడ మహేష్, మూడ మనోజ్ తదితరులు ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సురేష్, కాంగ్రెస్ మండల వీవర్స్ సెల్ అధ్యక్షుడు నల్ల యాదగిరి, కాంగ్రెస్ నాయకులు పంగ ఐలయ్య, కున్సోత్ లక్ష్మణ్, మూడ జగురామ్, పంగ వెంకన్న, కాసర్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# బొంగరాల రాములమ్మ పార్థివదేహానికి నివాళులర్పించిన కుంభం ప్రశాంత్ రెడ్డి





**గుర్రంపోడు, యువ వెలుగు, సెప్టెంబర్ 06 :** పిట్టలగూడెం గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు బొంగరాల దశరథ మాతృమూర్తి బొంగరాల రాములమ్మ రాత్రి మరణించారు ఆమె పార్థివ దేహాన్ని సందర్శించిన కుంభం ప్రశాంత్ రెడ్డి, ఆమెకు పూల మాల వేసి నివాళులర్పించారు. రాములమ్మ మృతిపట్ల తీవ్ర విచారం వ్యక్తం చేసిన ఆయన, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా రాములమ్మ కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పిస్తూ, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబానికి ఈ విషాద సమయంలో అండగా ఉంటామని కుంభం ప్రశాంత్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కుంభం ప్రశాంత్ రెడ్డి, వార్డుమెంబర్లు, పోలే ఆదాం, బైరు మల్లేష్, కట్ట యాదయ్య మేస్త్రి, నాయకులు కట్ట వెంకటేశం, మారపాక చిరంజీవి, చింతరెడ్డి రవీందర్ రెడ్డి, పోలే చక్రవర్తి, కట్ట హరీష్, పెరిక గిరి, దోటి అనిల్ కట్ట బిక్షం, మారపాక కరుణాకర్ పోలే లింగస్వామి, పోలే వెంకన్న, నాయకులు మరియు తదితరులు పాల్గొన్నారు

# మేడిపల్లిలో భారీ దోపిడీ

## 11 నిమిషాల్లో రూ.2.5 కోట్లు లూటీ!

**హైదరాబాద్, యువ వెలుగు, సెప్టెంబర్ 06 :** హైదరాబాద్ శివారు మేడిపల్లిలో భారీ దోపిడీ జరిగింది. టాటా గ్రూప్‌కు చెందిన క్యారెట్‌లేన్ ఆభరణాల షోరూంలోకి చొరబడిన దుండగులు, కేవలం 11 నిమిషాల వ్యవధిలోనే సుమారు రూ.2.5 కోట్ల విలువైన బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. ఈ ఘటన సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై ఉన్న ఈ షోరూంలోకి మాస్కులు ధరించిన ఏడుగురు దొంగలు సోమవారం తెల్లవారుజామున 4:07 గంటలకు చొరబడ్డారు. ముందుగా బయట ఉన్న సీసీ కెమెరా, అలారం వైర్లను కత్తిరించి, ఇనుప రాడ్లతో షట్టర్ తాళాలు పగలగొట్టారు. అనంతరం ఒక వ్యక్తి అద్దం పగలగొట్టి లోపలికి ప్రవేశించగా, మిగిలిన ఆరుగురు బయట కాపలా కాశారు. లోపలికి వెళ్లిన వ్యక్తి కేవలం ఐదు నిమిషాల్లోనే 580 బంగారు ఆభరణాలను రెండు బ్యాగుల్లో సర్దుకుని బయటకు వచ్చాడు. ఉదయం 4:18 గంటలకు నిందితులందరూ అక్కడి నుంచి పరారయ్యారు.

ఉదయం 7 గంటల సమయంలో వాచ్‌మ్యాన్ షట్టర్ తెరిచి ఉండటాన్ని గమనించి, షోరూం ఫ్రాంచైజీ యజమాని సుబ్రహ్మణ్యంకు సమాచారం ఇచ్చారు. ఆయన వెంటనే మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆధారాలు సేకరించి, నిందితుల కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు.

దోపిడీ జరిగిన తీరును బట్టి ఇది పక్కా ప్రణాళికతో జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. నిందితులు యువకులే అయి ఉండొచ్చని, ఇది బిహార్‌కు చెందిన ముఠా పనే కావచ్చని అనుమానిస్తున్నారు. ఇటీవల దుకాణంలో ముగ్గురు ఉద్యోగులు మానేసిన నేపథ్యంలో, వారి ప్రమేయంపైనా పోలీసులు విచారణ జరుపుతున్నారు. సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తూ నిందితుల కోసం గాలింపు ముమ్మరం చేశారు.

## మాజీ మావోయిస్టులను తమ పార్టీలోకి ఆహ్వానించిన కవిత

(మొదటి పేజీ తరువాయి)

పరిశీలించారు. ఆలయ పునర్నిర్మాణంలో కాంక్రీట్ వాడటాన్ని ఆమె తీవ్రంగా వ్యతిరేకించారు. ఆగమశాస్త్రం ప్రకారం కృష్ణశిలలతో నిర్మిస్తేనే ఆలయం వందల ఏళ్లపాటు నిలుస్తుందని, చారిత్రక వారసత్వాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. భక్తులు సమర్పించిన గోవులు సరైన మేత, నీరు లేక మరణిస్తున్నాయని, వాటికి కనీసం హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు కూడా జరపడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. "అడవిని వదిలేసి వచ్చిన మాజీ మావోయిస్టులు ప్రజా జీవితంలోకి రండి.. మా పార్టీ మీకు మంచి ప్లాట్‌ఫామ్" అని కవిత పిలుపునిచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుసంధానంగా సిరిసిల్ల-వేములవాడ ప్రాంతంలో సాగునీటి పనులు చేపట్టాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం దిశానిర్దేశం కోల్పోయిందని, అందుకే ప్రజలు తమలాంటి కొత్త పార్టీల వైపు చూస్తున్నారని విమర్శించారు. అంతకుముందు, ఆమె శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## సీఎం రేవంత్ రెడ్డి కుటుంబంపై ఆరోపణలు: బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

దీనిపై కాంగ్రెస్ నాయకుడు మెట్టు సాయి కుమార్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్), సైబర్ క్రైమ్ విభాగాలకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు అక్టోబర్ 5న హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో క్రిశాంక్, MR మీడియా తెలంగాణ" ప్రతినిధులపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సెక్షన్లు 353(2), 352 కింద కేసులు నమోదయ్యాయి. అరెస్టుకు ముందు క్రిశాంక్ ఈ వ్యవహారంపై స్పందిస్తూ, వివాదాస్పద లావాదేవీల ద్వారా నల్లధనాన్ని తెల్లధనంగా మార్చుకున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి కుటుంబానికి చెందిన వ్యాపార ఆస్తులు, ఆర్థిక లావాదేవీలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)తో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదే కేసులో గతంలో బీఆర్ఎస్ నాయకులు సాయికిరణ్, వినీత్‌లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. క్రిశాంక్ అరెస్టును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి అవినీతిని ప్రశ్నించినందుకే కక్షపూరితంగా క్రిశాంక్‌ను లక్ష్యంగా చేసుకున్నారని ఆయన ఆరోపించారు. ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తోందని, ప్రభుత్వ వైఫల్యాలను నిరంతరం ఎండగడుతూనే ఉంటామని ఆయన సోషల్ మీడియా వేదికగా స్పష్టం చేశారు.

మరోవైపు బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని ప్రభుత్వం, కాంగ్రెస్ నేతలు కొట్టిపారేశారు. ముఖ్యమంత్రి కుటుంబానికి మెడికవర్ ఆసుపత్రితో ఎటువంటి వ్యాపార సంబంధాలు లేవని తెలంగాణ ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. తాజా అరెస్టు పరిణామాలతో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ విమర్శలు, ప్రతివిమర్శలు మరింత ముదిరాయి.

## తెలంగాణలో కొత్త ల్యాండ్ పూలింగ్ పాలసీ?

(మొదటి పేజీ తరువాయి)

సంస్థలు, జిల్లా కలెక్టర్లు సహా ప్రభుత్వం గుర్తించే ఇతర సంస్థలు ల్యాండ్ పూలింగ్ చేపడతాయి. రీజినల్ రింగ్ రోడ్డు, గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే, ప్రతిపాదిత బుల్లెట్ రైలు టెర్మినల్ వంటి ప్రాజెక్టులకు వేల ఎకరాలు అవసరం. ముఖ్యంగా రంగారెడ్డి జిల్లాలో భూముల అవసరం ఎక్కువగా ఉంది. దీంతో ప్రభుత్వం ఈ విధానంపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఈ పథకంలో పట్టా భూముల యజమానులతో పాటు అసైన్డ్ భూములు, సీలింగ్ మిగులు భూములు, భూదాన్ భూములు, కొన్ని ప్రభుత్వ భూముల ఆక్రమణదారులకు కూడా ప్రయోజనం కల్పించనున్నారు. అయితే తిరిగి ఇచ్చే భూమి విస్తీర్ణం, భూమి హక్కు, ప్రాంతాన్ని బట్టి మారుతుంది ఈ విధానంలో రెండు మార్గాలను ప్రతిపాదించారు. యజమానులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి పూలింగ్ కోరితే దాన్ని 'కన్సెంట్ బేస్డ్ ల్యాండ్ పూలింగ్'గా పరిగణిస్తారు. రింగ్ రోడ్లు, పారిశ్రామిక కారిడార్లు, కొత్త పట్టణాల వంటి కీలక ప్రాంతాల్లో ప్రభుత్వం స్వయంగా చేపట్టే పూలింగ్‌ను 'గైడెడ్ ల్యాండ్ పూలింగ్'గా పేర్కొన్నారు. మూసీ ప్రాజెక్టు, హెచ్ఎండీఏ, హెచ్‌జీసీఎల్ ప్రాజెక్టులకు ఇప్పటికే ప్రభుత్వం జీవో 240, జీవో 243 జారీ చేసింది. వీటి ప్రకారం పట్టా భూములకు ఎకరానికి గరిష్ఠంగా 1,400 చదరపు గజాలు లేదా అభివృద్ధి చేసిన భూమిలో 50 శాతం వాటా.. ఏది తక్కువైతే అది లభిస్తుంది. సరస్సులు, నదుల బఫర్ ప్రాంతాల్లో ఎకరానికి 800 చదరపు గజాలు, ఎఫ్‌టీఎల్ ప్రాంతాల్లో 400 చదరపు గజాల వరకు ఇవ్వనున్నారు. భూసేకరణ చట్టాన్ని పక్కన పెట్టేందుకే ఈ విధానం కాదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ప్రజలకు నోటీసులు, అభ్యంతరాలకు అవకాశం, పరిహారం, పునరావాసం వంటి నిబంధనలు కొనసాగుతాయని చెబుతున్నారు.

# హైదరాబాద్‌కు తాగునీటి గండం

## డిసెంబర్‌కే సంక్షోభం తప్పదా?

**వేగంగా అడుగంటుతున్న సింగూర్, ఉస్మాన్‌సాగర్ జలాశయాలు**

**మరో 60 రోజుల్లో సింగూర్ ఎండిపోయే ప్రమాదం ఉందని ఆందోళన**

**డిసెంబర్ నుంచే నీటి కష్టాలు తప్పవని అధికారుల హెచ్చరిక**

**అత్యవసర ప్రణాళికలు సిద్ధం చేయాలని జలమండలి ఆదేశం**



**హైదరాబాద్, యువ వెలుగు, సెప్టెంబర్ 06 :** భాగ్యనగరానికి తాగునీటి గండం పొంచి ఉంది. ఈ ఏడాది చివరి నాటికి హైదరాబాద్ నగరంలో తీవ్రమైన తాగునీటి సంక్షోభం తలెత్తే అవకాశాలు కనిపిస్తున్నాయి. వర్షాభావ పరిస్థితులు, ఎల్ నినో ప్రభావంతో నగరం యొక్క ప్రధాన నీటి వనరులైన జలాశయాల్లో నీటిమట్టాలు ప్రమాదకర స్థాయికి పడిపోవడమే ఇందుకు ప్రధాన కారణం. అధికారులు ముందుగానే హెచ్చరికలు జారీ చేస్తూ, ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించారు.

**సింగూర్‌కు ముప్పు.. ఐటీ కారిడార్‌పై ప్రభావం**

హైదరాబాద్‌లోని ఐటీ కారిడార్, పశ్చిమ ప్రాంతాలకు నీటిని సరఫరా చేసే కీలకమైన సింగూర్ జలాశయం పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా మారింది. ఈ జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 29.9 టీఎంసీలు కాగా, ప్రస్తుతం కేవలం 3.9 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ఇది మొత్తం సామర్థ్యంలో కేవలం 13 శాతం మాత్రమే. వేసవిలో ఉన్న నీటి నిల్వలతో పోలిస్తే ఇది సగానికి పడిపోవడం గమనార్హం. ఇదే పరిస్థితి కొనసాగితే మరో 60 రోజుల్లో, అంటే డిసెంబర్ మధ్య నాటికే సింగూర్ జలాశయం పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఉందని అధికారులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

**అన్ని జలాశయాల్లో ఇదే పరిస్థితి**

పాతబస్తీ, చుట్టుపక్కల ప్రాంతాలకు నీరందించే మరో ముఖ్యమైన వనరు ఉస్మాన్‌సాగర్ (గండిపేట) నీటిమట్టం కూడా గణనీయంగా తగ్గింది. గతంలో సుమారు 3.5 టీఎంసీలుగా ఉన్న నీటి నిల్వ ఇప్పుడు 2.2 టీఎంసీలకు పడిపోయింది. వీటికి తోడు, నాగార్జున సాగర్‌తో అనుసంధానమైన జలాశయాలతో సహా ఇతర ప్రధాన రిజర్వాయర్లకు కూడా ఇన్‌ఫ్లోలు (నీటి చేరిక) భారీగా తగ్గిపోయాయి. దీంతో నగరంపై నీటి సంక్షోభ మేఘాలు మరింత దట్టంగా కమ్ముకుంటున్నాయి.

**అప్రమత్తమైన జలమండలి, ప్రభుత్వం**

పరిస్థితి తీవ్రతను గ్రహించిన హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్ (హెచ్‌ఎండబ్ల్యూఎస్ఎస్బీ) వెంటనే అప్రమత్తమైంది. సింగూర్, మంజీరా జలాలపై ఆధారపడిన ప్రాంతాలకు ప్రత్యామ్నాయ నీటి వనరులు, సరఫరా మార్గాలను గుర్తించి, అత్యవసర కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించింది.

సాధారణంగా వేసవి కాలంలో ఎదురయ్యే నీటి ఎద్దడి, ఈసారి ముందుగానే డిసెంబర్ లేదా జనవరి నెలల నుంచే ప్రారంభమయ్యే అవకాశం ఉందని నీటిపారుదల శాఖకు చెందిన ఓ చీఫ్ ఇంజనీర్ అభిప్రాయపడ్డారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం 17 శాతం వర్షపాతం లోటు ఉందని అధికారికంగా ప్రకటించింది.

వ్యవసాయ అవసరాల కంటే తాగునీటికే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించింది. మొత్తం మీద రాబోయే రోజుల్లో భాగ్యనగర వాసులు నీటి కష్టాలను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# చిన్నారుల్లో పోషకాహార లోపం లేని జిల్లాగా వనపర్తిని తీర్చిదిద్దడమే లక్ష్యం : జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి జిల్లా, యువ వెలుగు, అక్టోబర్ 6 :** వనపర్తి జిల్లాలో మహిళలు, గర్భిణుల్లో రక్తహీనతను పూర్తిగా నివారించి, రక్తహీనత లేని జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రత్యేక కార్యక్రమాల్ని చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 9వ పోషణ మాసం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మహిళలు, గర్భిణుల్లో రక్తహీనతను గుర్తించి సకాలంలో చికిత్స అందించడం ద్వారా తల్లి, శిశు వు ఆరోగ్యాన్ని కాపాడవచ్చని తెలిపారు. రక్తహీనత నివారణ కోసం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతున్నట్లు, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అంగన్వాడీ కార్యకర్తలు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.వనపర్తి జిల్లాను సామ్, మ్యామ్(ఎత్తుకు తగ్గ బరువు లేకపోవడం, పోషకాహార లోపం) పిల్లలు లేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ అన్నారు. గతేడాది జిల్లాలో 438 మంది సామ్ పిల్లలు ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 106 మందికి తగ్గిందని తెలిపారు. మిగిలిన పిల్లలకు కూడా అవసరమైన పోషకాహారం అందిస్తూ వారి ఆరోగ్యాన్ని మెరుగుపరచడం అభినందనీయమని పేర్కొన్నారు.జిల్లాలో ఎక్కడైనా సామ్, మ్యామ్ పిల్లలు ఉన్నట్లు గుర్తించిన వెంటనే వారికి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి, పోషక పునరావాస కేంద్రాలకు (ఎన్ఆర్సీ) తరలించాలని సూచించారు. అక్కడ వారికి మెరుగైన పోషకాహారం, వైద్య చికిత్స అందించి సాధారణ ఆరోగ్య స్థితికి తీసుకురావాలని తెలిపారు.

**అంగన్వాడీల సేవలు అభినందనీయం**

జిల్లాను సామ్, మ్యామ్ పిల్లలు లేని జిల్లాగా తీర్చిదిద్దడంలో అంగన్వాడీ కార్యకర్తల పాత్ర ఎంతో కీలకమని కలెక్టర్ అన్నారు. బిఎల్వోలుగా తమ విధులను నిర్వహించడంతో పాటు సెప్టెంబర్ 9వ తేదీ నుంచి నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించి ప్రజల్లో పోషకాహారం, ఆరోగ్యం, తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించిన అంగన్వాడీ సిబ్బందిని అభినందించారు. అప్పుడే పుట్టిన శిశువులకు మొదటి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. తల్లిపాలలో శిశువుకు అవసరమైన పోషక పదార్థాలు, రోగనిరోధక శక్తిని పెంచే అంశాలు సమృద్ధిగా ఉంటాయని తెలిపారు. తల్లిపాల ప్రాముఖ్యతపై గర్భిణులు, బాలింతలకు నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు.

**సీమంతం, అన్నప్రాసన, అక్షరాభ్యాసం**

పోషణ మాసం ముగింపు కార్యక్రమంలో భాగంగా పలువురు గర్భిణులకు సీమంతం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పలువురు చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాస కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి చేతుల మీదుగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి హరికృష్ణ, జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. భాస్కర్ నాయక్, డీపీఆర్ఓ సీతారాం, రాంబాబు, ఇతర అధికారులు, సీడీపీఓలు, అంగన్వాడీ కార్యకర్తలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## పోలీస్ ఉద్యోగాల కోసం ఉచిత శిక్షణ

**వికారాబాద్, యువ వెలుగు, అక్టోబర్ 6 :** వికారాబాద్ జిల్లాకి చెందిన అర్హులైన ఆదివాసి మరియు గిరిజన యువతీ యువకులకు పోలీస్ కానిస్టేబుల్, ఎస్ ఐ ఉద్యోగాలకు సన్నద్ధం చేసేందుకు తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ సహకారంతో సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (పివిటిజి-చెంచు) మన్ననూర్ ఆధ్వర్యంలోఉచిత భోజన వసతితో కూడిన శిక్షణ తరగతులునిర్వహించడం జరుగుతుంది. కావున ఆసక్తి గల గిరిజన యువతి-యువకులు ఇట్టి ఉచిత శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోగలరని సలోని ఛబ్రా ఐ.ఏ.యస్, ప్రాజెక్ట్ అధికారి సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (పివిటిజి-చెంచు) మన్ననూర్ ఒక ప్రకటనలో తెలిపారు. స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా మొత్తం 100 మంది అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు, ఎంపికైన అభ్యర్థులకు సుమారు 2నెలల పాటు ప్రిలిమ్స్ పరీక్ష తేదీ వరకు ఉచిత రెసిడెన్షియల్ కోచింగ్ అందించనున్నారు. అర్హులు అభ్యర్థులు రూ.3 లక్షల ఆదాయ పరిమితికి సంబంధించిన ఇన్కమ్ సర్టిఫికెట్తో పాటు కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్లు, పోలీస్ ఉద్యోగానికి దరఖాస్తు చేసిన పత్రం సమర్పించాలి. అభ్యర్థులు పోలీస్ రిక్రూట్మెంట్ నిబంధనలకు అనుగుణంగా ఉండాలన్నారు. దరఖాస్తుల ప్రారంభం :05-10-2026 కాగా,దరఖాస్తుల చివరి తేదీ :09-10-2026 సాయంత్రం 5.00 గంటల వరకు ఉంటుందన్నారు. స్క్రీనింగ్ టెస్టు :15-10-2026 ఉంటుందన్నారు. జాబితా విడుదల 16-10-2026, సర్టిఫికెట్ వెరిఫికేషన్ 17-10-2026, తుది ఫలితాలు 19-10-2026, తరగతుల ప్రారంభం 21-10-2026 అవుతాయని అన్నారు.ఆసక్తి గల అభ్యర్థులు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి వారి కార్యాలయం, వికారాబాద్లో సంప్రదించి దరఖాస్తు ఉచితంగా పొంది సమర్పించగలరు, మరిన్ని వివరాల కొరకు ఫోన్ నం.9010487700 సంప్రదించండి.

## పాతర్లపల్లిలో ఘనంగా అంగన్ మిలాన్

**అంగన్వాడీ, ఆశా కార్యకర్తలకు సన్మానం**



**ఇల్లందకుంట, యువ వెలుగు, అక్టోబర్ 6 :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప అభియాన్'లో భాగంగా పాతర్లపల్లి గ్రామంలో 'అంగన్ మిలాన్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్, బీజేపీ ఇల్లందకుంట మండల అధ్యక్షుడు బైరెడ్డి రమణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కరీంనగర్ మాజీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అంగన్వాడీ టీచర్లు, సహాయకులు, ఆశా కార్యకర్తలను శాలువాలతో సన్మానించి వారి సేవలను అభినందించారు. అనంతరం గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాలు చిన్నారులకు పౌష్టికాహారం, ఆరోగ్య సంరక్షణ, ప్రాథమిక విద్య అందించడంతోపాటు గర్భిణీలు, బాలింతల సంక్షేమంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. మహిళలు, చిన్నారుల ఆరోగ్యం, పోషణ, విద్య, అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. 'సేవే లక్ష్యం.. ప్రజా సంక్షేమమే ధ్యేయం' అనే స్ఫూర్తితో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి గుత్తికొండ రాంబాబు, ఉప్పుల రమేష్, ఇంగ్లే ప్రభాకర్, తడిగొప్పుల రమేష్, తాళ్ల లావణ్య, చింతల ఐలయ్య, నల్ల లింగారెడ్డి, గుడికందుల పావని, తాళ్ల పాపిరెడ్డి, ఆసాల సుధాకర్, తుపాకుల సతీష్, ఉప్పు దుర్గయ్య, జిల్లెల్ల శ్రీపాల్రెడ్డి, ఇంగ్లే రమేష్, జంగం సమ్మయ్య, వడ్లకొండ జలపతి, చల్లూరి కుమార్, ఎలవేణి శ్రీధర్, చిట్ల శ్రీనివాస్, కోడం నవీన్, అంగన్వాడీ టీచర్లు, సహాయకులు, ఆశా కార్యకర్తలు, మహిళలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి

**మూడు కోట్ల 18 లక్షల 50 వేలకు అభివృద్ధి పనులకు శంకుస్థాపన**



**మహేశ్వరం, యువ వెలుగు, అక్టోబర్ 6 :** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని తుక్కుగూడ మున్సిపాలిటీ. మంకల్. డివిజన్ తుక్కుగూడ -మంకల్ డివిజన్ పరిధిలో మొత్తం రూ.3 కోట్ల 18 లక్షల 50 వేల నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు బిమాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి గారుబి శంకుస్థాపన చేశారు. రావిర్యాల ఓల్డ్ బ్రిడ్జి నుంచి సర్దార్నగర్ గ్రామం వరకు చేపట్టనున్న డ్రైనేజీ పనులు, సూర్యగిరి ఎల్లమ్మ దేవాలయం ఆర్చ్ నుంచి రావిర్యాల వరకు చేపట్టనున్న బీటీ రోడ్డు, సీసీ రోడ్డు విస్తరణ పనులు, మరియు. ఔటర్రింగురోడ్డు. సర్వీస్ రోడ్డు నుంచి జన్నాయిగూడ వరకు చేపట్టనున్న రోడ్డు పనులకు. ఏ మ్మెల్యే. సబితా ఇంద్రారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా లిసబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ దేవస్థానానికి ప్రతిరోజూ వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం వస్తుంటారని,వారికి రోడ్డు ఇబ్బందులు చాలా ఆటంకం కలుగుతున్నాయని సరైన రోడ్డు, డ్రైనేజీ సౌకర్యాలు లేక వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ దేవాలయం కు వచ్చే భక్తులకు. ఈ పనులతో భక్తులు, స్థానిక ప్రజల సమస్యలకు పరిష్కారం లభించనుందని. ఎమ్మెల్యే సబిత ఇంద్ర రెడ్డి అన్నారు.

అనంతరం శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ దేవస్థానాన్ని సందర్శించిన సబితా ఇంద్రారెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, స్థానిక ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడేలా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో మున్సిపల్ ఫండ్ ద్వారా పలు రోడ్లు, డ్రైనేజీ పనులకు నిధులు మంజూరయ్యాయని, అయితే ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక అభివృద్ధి పనులను నిలిపివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. ప్రస్తుతం జీహెచ్ఎంసీ ద్వారా నిలిచిపోయిన పనులకు మళ్లీ నిధులు మంజూరు చేయడం జరుగుతోందని ఆమె తెలిపారు. ప్రజా సమస్యలను గాలికి వదిలి ఫ్యూచర్ సిటీ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఆమె విమర్శించారు. ప్రజలకు అవసరమైన రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు తదితర మౌలిక వసతులపై ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు. మంజూరైన పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను సబితా ఇంద్రారెడ్డి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నిజమైన గీత కార్మికులకు సభ్యత్వం ఇవ్వాలి

**- గీత పారిశ్రామిక సంఘం అక్రమాలపై విచారణ జరపాలి**

**ఉద్యోగుల సభ్యత్వం తొలగించాలి**

**- విలేకరుల సమావేశంలో గౌడ జన హక్కుల పోరాట సమితి నాయకుల ఆరోపణ**




**నిర్మల్, యువ వెలుగు, అక్టోబర్ 6 :** నిర్మల్ పట్టణంలో నిర్వహించబడుతున్న గీతా పారిశ్రామిక సంఘం అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి నిజమైన గీతా కార్మికులకు సభ్యత్వం ఇవ్వాలని గౌడ జన హక్కుల పోరాట సమితి సభ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం నిర్మల్ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో నిర్వహించబడుతున్న గీతా పారిశ్రామిక సంఘంలో నిజమైన గీత కార్మికులకు సభ్యత్వం ఇవ్వకుండా వ్యాపారులకు, ఉద్యోగులకు,బడా రాజకీయ నేతలకు, కాంట్రాక్టర్ లకు సభ్యత్వం ఇచ్చి పేద గౌడ కులస్తుల ఉపాధిని కొల్లగొడుతున్నారని వారు ధ్వజమెత్తారు. దీనిపై సంబంధిత ఎక్సైజ్ అధికారులకు పూర్తి వివరాలతో ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయంపై కలెక్టర్ కూడా ప్రజా ఫిర్యాదు విభాగంలో ఫిర్యాదు అందజేసినట్లు తెలిపారు. ఈ గీత పారిశ్రామిక సంఘంలో పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా 11 విక్రయ కేంద్రాలు నిర్వహించవలసి ఉండగ 20 చోట్ల తెల్లకల్లు విక్రయాలు జరుపుతున్నారని వారు ఆరోపించారు. నిర్మల్ పట్టణంలో గీతా వృత్తిని నిర్వహించుకుంటూ ఏ ఆధారం లేని నిరుపేద గీత కార్మికులకు, ఏ ఆధారం లేక గీత వృత్తిని నమ్ముకొని జీవించే కుటుంబాలకు సభ్యత్వంలో అవకాశం కల్పించాలని దరఖాస్తు పెట్టుకున్న పారిశ్రామిక సంఘం ప్రతినిధులు వాటిని తిరస్కరించడం జరుగుతుందని తెలిపారు. నిర్మల్ గీత పారిశ్రామిక సంఘంలో బడా నాయకులు, కాంట్రాక్టర్లు, రిటైర్డ్ ఉద్యోగులు, ఉద్యోగులకు ఉన్న సభ్యత్వాల జాబితాలు బయట పెడితే బెదిరింపులకు పాల్పడుతున్నారని వారు ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు దీనిపై విచారం జరిపి చర్యలు చేపట్టని పక్షంలో వారం రోజుల్లో ఉద్యమ కార్యచరణ ప్రకటిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గౌడ జన హక్కుల పోరాట సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షులుబుర్ర దేవేందర్ గౌడ్, గౌడ ఐక్య సాధన పోరాట సమితి స్టేట్ జనరల్ సెక్రెటరీ పొన్నం నారాయణ గౌడ్, గౌడ హక్కుల పోరాట సమితి నిర్మల్ జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్ గౌడ్, విశాల్ గౌడ్, పొన్నం శివాజీ గౌడ్ గౌడ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ప్రకాష్ పటేల్ ఆధ్వర్యంలో మండల ఓబీసీ మోర్చా అధ్యక్షులుగా కోయిగురు సాయిలు (పొట్టెన్న)



**కోటగిరి, యువ వెలుగు, అక్టోబర్ 6 :** కోటగిరి మండల ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులుగా కోయుగురు సాయిలు ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వేముల నవీన్ ప్రధాన కార్యదర్శి వడ్ల శ్యామ్ బూత్ అధ్యక్షులు మామిడి శ్రీనివాస్ మామిడి సాయిలు కర్నె పోశెట్టి లింగం సాయిలు వార్డ్ మెంబర్ గంగారెడ్డి నాగరాజు రవి కార్యకర్తలు పాల్గొన్నారు.

## గద్వాలలో ఈ నెల 9న కిసాన్ మేళా

**జోగులాంబ గద్వాల జిలా, యువ వెలుగు, అక్టోబర్ 6 :** వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికత, నూతన సాగు పద్ధతులు, అధిక దిగుబడి సాధించే మార్గాలపై జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశాల మేరకు రైతులకు అవగాహన కల్పించేందుకు ఈ నెల 9న 'కిసాన్ మేళా' నిర్వహిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహా వ్యవసాయ విజ్ఞాన సదస్సును జిల్లా కేంద్రంలోని రూరల్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న కేఎస్ ఫంక్షన్ హాల్లో నిర్వహిస్తామన్నారు. ఇందులో ఆధునిక వ్యవసాయ పరికరాలు, ఆధు నిక సాగు యంత్రాలు, డ్రోన్ టెక్నాలజీపై తెలియ జేయడం జరుగుతుందన్నారు. ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులతో ముఖాముఖి చర్చలు, పంటల సాగులో మెలకువలు, తెగుళ్ల నివారణపై సలహాలు ఇవ్వడం జరుగు తుంద న్నారు. నాణ్యమైన హైబ్రిడ్ విత్తనాలు, నూతన ఎరువుల వాడకంపై అవగాహన, రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ రాయితీలు, పథకాల వివరాలు మరియు దరఖాస్తు విధానంపై మార్గ దర్శకాలు చేస్తారన్నారు. రైతన్నలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, ఆధునిక వ్యవసాయ పద్ధతు లను తెలుసుకుని లాభసాటి వ్యవసాయం వైపు అడుగులు వేయాలని ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పేర్కొన్నారు.

# ఏడాదిలోపే ఇందిరమ్మ టవర్స్ పూర్తి చేసి లబ్ధిదారుల చేతికి తాళాలిస్తాం

**5,218 మంది అర్హుల నుంచి లక్కీ డ్రా॥ 480 కుటుంబాలకు ఇళ్ల కేటాయింపు**

**రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**కుత్బుల్లాపూర్, యువ వెలుగు, అక్టోబర్ 6 :** క్యూర్ పరిధిలో తొలివిడత ప్రయోగాత్మకంగా నిర్మిస్తున్న లక్ష ఇళ్ల ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాలను పారదర్శకంగా, వేగంగా పూర్తి చేసి ఏడాదిలోగా అందించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. దీనిలో భాగంగా ఏడాది గడువును కాంట్రాక్టర్లకు నిర్దేశించామని అయితే ఒక నెల ముందుగా పూర్తి చేస్తే రూ.45 లక్షలు, రెండు నెలల ముందుగా పూర్తి చేస్తే రూ. 90 లక్షలు ప్రోత్సాహక బహుమతిగా ఇస్తామని వివరించారు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామారంలో మంగళవారం ఇందిరమ్మ ఇండ్ల టవర్స్కు సహచర మంత్రి, జిల్లా ఇన్ఛార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే కే.పీ, వివేకానంద, పలువురు లబ్ధిదారులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు 23 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఇందిరమ్మ టవర్స్ ను నిరంతర ప్రక్రియగా నిర్మిస్తామని తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఇళ్ల కోసం 7,000 మందికి పైగా దరఖాస్తులు అందగా, పరిశీలన అనంతరం 5,218 మంది అర్హులుగా తేలారని అర్హులైన వారిలో లబ్ధిదారుల ఎంపికను బహిరంగంగా లక్కీ డ్రా ద్వారా చేపట్టి, 480 మంది లబ్ధిదారులను తుది జాబితాలో ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఎంపిక ప్రక్రియను ఆన్లైన్ విధానంలో పారదర్శకంగా నిర్వహించామని, ఎవరికి ఏ విధంగా ఇల్లు మంజూరైందనే వివరాలను కూడా లబ్ధిదారులకు తెలియజేయడంతో పాటు సంబంధిత ధ్రువ పత్రాలను అందజేస్తామని చెప్పారు. ప్రస్తుతం కేటాయించిన ఇళ్లతో కార్యక్రమం ముగియదని, మరో మూడు విడతల్లోనూ ఇళ్ల నిర్మాణాన్ని చేపడతామని మంత్రి చెప్పారు. ప్రస్తుతం సుమారు 7.5 ఎకరాల స్థలం అందుబాటులో ఉందని, దీనితో పాటు నియోజకవర్గంలో ఉన్న ఇతర ప్రభుత్వ, హౌసింగ్ శాఖ భూములను గుర్తించి అక్కడ కూడా పేదలకు ఇళ్లు నిర్మించే చర్యలు చేపడతామని తెలిపారు. ఈ మేరకు హౌసింగ్ శాఖ ఉన్నతాధికారులకు ఇప్పటికే సూచనలు చేసినట్లు వెల్లడించారు ఇళ్ల నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని మంత్రి అన్నారు. లబ్ధిదారులు కూడా తమ ఇళ్ల నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు.

మీ కళ్ల ముందే మీ ఇల్లు నిర్మించబడాలి నాణ్యతతో కూడిన ఇంటిని సొంతం చేసుకున్నామనే తృప్తి, ఆనందం మీకు కలగాలి అనేదే ఇందిరమ్మ ప్రభుత్వ ఉద్దేశమని చెప్పారు. పేదల చిన్న చిన్న కోరికలను నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం ఆ దిశగా చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. పేదవాడి సొంతింటి కలను కేవలం హామీగా కాకుండా, కార్యరూపంలోకి తీసుకువస్తున్నామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. కార్యక్రమంలో, హౌసింగ్ శాఖ సెక్రెటరీ వి.పి.గౌతమ్, కలెక్టర్ మనూ చౌదరి. తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పలువురు లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పట్ల ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చిత్రపటానికి పాలాభిషేకం

**రైతు పక్షపాతి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్**

**ఏఎంసి చైర్మన్ శ్రీనివాస్ ముదిరాజ్**

**వికారాబాద్, యువ వెలుగు, అక్టోబర్ 6 :** రైతుల సంక్షేమం కోసం నిరంతరం ఆరాట పడే మహా వ్యక్తి తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అని వికారాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చాపల శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు. మంగళవారం వికారాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ ముదిరాజ్ ఆధ్వర్యంలో మార్కెట్ అభివృద్ధి కొరకై రూపాయలు 2.62.(రెండు కోట్ల అరవై రెండు లక్షలు) ప్రభుత్వం ద్వారా మంజూరు చేపించి అధికారిక ఉత్తర్వులు వెలువడినందున కృతజ్ఞతలు తెలియజేస్తూ తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ వికారాబాద్ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ చిత్రపటానికి పాలాభిషేకం చేయడం జరిగింది.ఏఎంసి చైర్మన్ చాపల శ్రీనివాస్ ముదిరాజ్ మాట్లాడుతూ.... తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ రైతుల కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు.రైతుల సంక్షేమం కోసం,రైతులకు మౌలిక సదుపాయాలు కల్పించాలనే మంచి ఉద్దేశంతో కోట్ల రూపాయలు నిధులు వెచ్చించి అభివృద్ధి కార్యక్రమలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. మార్కెట్ కమిటీకి పూర్తిగా సహకరిస్తున్న తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కు పాలకవర్గం తరపున మరియు రైతుల పక్షాన ధన్యవాదములు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్ మల్లేశం, డైరెక్టర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థుల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి : కలెక్టర్ అంకిత్

**విద్య, వసతులు, భోజన సదుపాయాలపై కస్తూరిబా విద్యాలయంలో తనిఖీ**

**నీట్ కోచింగ్‌తో విద్యార్థులకు మెరుగైన శిక్షణ**

**విద్యార్థుల హాజరుపై ప్రత్యేక దృష్టి సారించాలి**



**కొత్తగూడెం, యువ వెలుగు, అక్టోబర్ 6 :** పాల్వంచ కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, పాఠశాలను జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అందుతున్న విద్యా బోధన, నీట్ కోచింగ్, విద్యార్థుల హాజరు,పరీక్షల నిర్వహణ,మౌలిక వసతులు,భోజన సదుపాయాలను పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు, మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికా రులు, ఉపాధ్యాయులకు సూచించారు. తనిఖీలో భాగంగా జిల్లా కలెక్టర్ ముందుగా ప్రధానోపా ధ్యాయురాలు, ఉపాధ్యాయుల హాజరు నమోదును పరిశీలించారు. పాఠశాలలో బోధనా కార్యక్రమాలు సక్రమంగా కొనసాగుతున్నాయా, ఉపాధ్యాయుల హాజరు ఎలా ఉంది, విద్యార్థుల హాజరు శాతం ఎంత అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు.విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, గైర్హాజరయ్యే విద్యార్థుల వివరాలను నమోదు చేసి, అవసరమైన సందర్భాల్లో వారి తల్లిదం డ్రులకు సమాచారం అందించాలని సూచించారు.

అనంతరం ఇంటర్మీడియట్ ఫస్టియర్, సెకండియర్ విద్యార్థులకు నిర్వహిస్తున్న పరీక్షలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.విద్యార్థులు ఏ సబ్జెక్టుకు పరీక్ష రాస్తు న్నారో అడిగి తెలుసుకోగా, కెమిస్ట్రీ పరీక్ష నిర్వహిస్తు న్నట్లు విద్యార్థులు తెలిపారు. పరీక్షల అనంతరం విద్యార్థులకు నిర్వహిస్తున్న అధ్యయన కార్యక్రమాల గురించి కూడా కలెక్టర్ ఆరా తీశారు.నీట్ కోచింగ్‌లో భాగంగా విద్యార్థులకు సాయంత్రం 3.45 గంటల నుంచి 6.00 గంటల వరకు అదనపు బోధనా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ తరగతుల్లో కెమిస్ట్రీ, ఫిజిక్స్, బోటనీ, జువాలజీ తదితర సబ్జెక్టుల్లో బోధన అందిస్తున్నట్లు వివరించారు.నీట్ ప్రవేశ పరీక్షకు విద్యార్థులు సమర్థ వంతంగా సన్నద్ధమయ్యేలా అదనపు తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అనంతరం పాఠశాలలోని 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులతో జిల్లా కలెక్టర్ నేరుగా మాట్లాడారు. విద్యార్థులు ఏ తరగతిలో చదువుతున్నారు, ఆరోజు ఏ సబ్జెక్టుకు పరీక్ష రాశారు, పరీక్ష ఎలా జరిగింది, తదుపరి పరీక్ష ఏ సబ్జెక్టులో ఉంది వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు సామాజిక శాస్త్రం, గణితం తదితర సబ్జెక్టుల పరీక్షలకు సంబంధించిన వివరాలను కలెక్టర్‌కు తెలిపారు. ఎఫ్ఏ-1 పరీక్షల్లో 80 మార్కులకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఉపాధ్యాయులు వివరించారు. విద్యార్థులతో మాట్లాడిన సందర్భంగా వారి చదువుపై ఆసక్తి, పరీక్షలకు సన్నద్ధమవుతున్న తీరు, తరగతుల నిర్వహణపై కలెక్టర్ ఆరా తీశారు. పరీక్షలు పూర్తయిన అనంతరం తదుపరి పరీక్షలకు ఎలా సిద్ధమవుతున్నారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ క్రమం తప్పకుండా చదువుకోవడంతో పాటు పరీక్షలకు ముందస్తు ప్రణాళికతో సిద్ధం కావాలని సూచించారు. ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలని పేర్కొన్నారు. పాఠశాలలో మొత్తం విద్యార్థుల సంఖ్య, తరగతుల వారీగా విద్యార్థుల సంఖ్యను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో మొత్తం 355 మంది విద్యార్థులు ఉన్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని కూడా ఆయన అడిగి తెలుసుకుని, విద్యార్థుల హాజరుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా అవసరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, వారి విద్యా ప్రగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు.అనంతరం విద్యాలయంలోని కిచెన్ షెడ్డును జిల్లా కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ప్రతిరోజూ ఆహారం అందిస్తున్నారా లేదా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధంగా ఉన్న ఆహార పదార్థాలను స్వయంగా పరిశీలించి, వాటి నాణ్యత, పరిమాణం, పరిశు భ్రతను తనిఖీ చేశారు. స్టోర్ రూమ్‌లో నిల్వ ఉంచిన సరుకులు, కూరగాయలు,వంటగది పరిసరాలను పరిశీలించి పరిశుభ్రత ప్రమాణాలను పాటిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. భోజనం నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వంట ప్రక్రియ నుంచి భోజనం వడ్డించే వరకు పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ప్రతిరోజూ మెనూ ప్రకారం భోజనం అందేలా సంబంధిత సిబ్బంది పర్యవేక్షించాలని ఆదేశించారు. గత సంవత్సరం నాబార్డ్ నిధుల ద్వారా మంజూరైన నిధులతో నూతనంగా నిర్మించిన అదనపు కిచెన్ షెడ్డును కూడా జిల్లా కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ పనుల వివరాలు, ప్రస్తుతం షెడ్డును ఏ విధంగా వినియోగిస్తున్నారనే విషయాలను సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా నిర్మించిన మౌలిక వసతులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు.

విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి విద్యా బోధనతో పాటు నాణ్యమైన వసతులు, పౌష్టికాహారం, పరిశుభ్రమైన వాతావరణం, అదనపు శిక్షణ అందించడం ఎంతో ముఖ్యమని జిల్లా కలెక్టర్ అంకిత్ పేర్కొన్నారు. విద్యార్థుల హాజరును మెరుగుపరచ డంతో పాటు పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేలా నిరంతరం మార్గనిర్దేశం చేయాలని, ప్రతి విద్యార్థి విద్యా ప్రగతిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు, ఉపాధ్యాయులకు సూచించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు, ఉపాధ్యాయులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జైపూర్‌లో వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాలు



**జైపూర్, యువ వెలుగు, అక్టోబర్ 6 :** వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా జైపూర్ లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థులకు అటవీ శాఖ ఆధ్వర్యంలో వన దర్శిని కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులను అడవిలోకి తీసుకెళ్లి బర్డ్ వాచింగ్ కార్యక్రమం నిర్వహించారు.

ఇది విద్యార్థులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా విద్యార్థులు అడవులు, వన్యప్రాణులు, పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్యంపై పలు అంశాలను తెలుసుకున్నా విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ఉందన్నారు కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రామకృష్ణ సర్కార్, బీట్ ఆఫీసర్లు వసంతలక్ష్మి, కె.రమేష్, కస్తూర్బా పాఠశాల అధ్యాపకురాలు సౌదర్య, విద్యార్థులు పాల్గొన్నారు. అడవులను కాపాడుదాం వన్యప్రాణులను సంరక్షిద్దాం భవిష్యత్ తరాలకు సుస్థిర అభివృద్ధిని అందిద్దాం అని అటవీ శాఖ అధికారులు పిలుపునిచ్చారు.

## సబ్బండ వర్గాల "ప్రజానేత శంకర్"

**ఓబీసీ మహాసభకు జనసంద్రంలా వెళ్లిన వీర్లపల్లి సైన్యం**

**అంచనాకు మించి జనాలు రావడంతో ఓ బి సి సభ దద్దరిల్లిగా**

**సబ్బండ వర్గాల ఈయేటి మేటిలీడర్ శంకర్ అంటూ ప్రజలు , కాంగ్రెస్ శ్రేణుల కితాబు**





**నందిగామ, యువ వెలుగు, అక్టోబర్ 6 :** అదే ధైర్యం.. అదే ఊపు.. అదే తెగింపు.. అదే తెగువ.. అదే పోరాటపటిమ.. అదే కార్య దర్శకత.. వెనకడుగు వేయకుండా అప్పగించిన పదవికి వంద శాతం న్యాయం చేయడంలో ఆయనకు ఆయనే సాటి. బీసీలకు కుల గణన ద్వార సామాజిక న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తూ శంషాబాద్ గడ్డ గొల్లపల్లి వేదికగా టిఓబీసీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ తలపెట్టిన బీసీ గర్జనకు కనివిని ఎరుగని రీతిలో ఓబీసీలే కాకుండా సబ్బండ వర్గాలు సపోర్ట్ చేయడంతో నందిగామ మండలం నుండి భారీ సంఖ్యలో తరలివచ్చిన జన సమూహం , కాంగ్రెస్ శ్రేణులతో వందలాది వాహనాల కాన్వాయ్ వీర్లపల్లి చరిత్రలో మరో మైలురాయి గా నిలిచింది అనడంలో ఎంత మాత్రం అతిశయోక్తి లేదు. కేవలం తనకు జన్మనిచ్చిన నందిగామ మండలంలోని అన్ని గ్రామాల నుండి ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎంపీపీ ఎం శివశంకర్ గౌడ్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేపల్లె కుమార్ గౌడ్, మాజీ అధ్యక్షుడు జంగ నరసింహులు, నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ ల ఆధ్వర్యంలో జనం తరలించడానికి సుమారు 150 కి పైగా వాహనాలు సిద్ధం చేసి గురువుకు తగ్గ శిష్యులు అనిపించుకున్నారు. ఇంకేముంది శంషాబాద్ గొల్లపల్లిలో జరిగే ఓబీసీల కుల గణన బీసీగర్జన విజయ శంఖారావం పూరించినట్లేనని జనం గంట పదంగా చెప్తున్నారు. నందిగామ మండలం నలుమూలల నుండి వచ్చిన భారీ వాహనాలతో పాత జాతీయ రహదారి, 44 వ బైపాస్ జాతీయ రహదారి పై బీసీ గర్జన వాహనాలు భారీ సంఖ్యలో వెళ్లాయి. సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ కార్యకర్తలు నినాదాలు చేస్తుండగా ఓబిసి సభ దద్దరిల్లింది.

## చర్లలో మెడికల్ షాపులు ఇన్ని ఆదాయం ఎలా..?

**42,947 మంది జనాభాకు 32 మెడికల్ షాపులు**

**పదిహేడు మెడికల్ షాపులు గ్రామీణ వైద్యులవే**

**ప్రభుత్వ వైద్య కేంద్రాలు మూడు ఉన్నా..**

**ప్రైవేట్ వైద్యంపై ఆధారపడుతున్న ప్రజలు**

**వైద్య రంగంపై అధికారుల దృష్టి సారించాలం టున్న స్థానికులు**

**చర్ల/భద్రాద్రి, యువ వెలుగు, అక్టోబర్ 6 :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలో వైద్య సేవల రంగం విస్తరించింది. ఒకవైపు ప్రభుత్వ వైద్య కేంద్రాలు అందుబాటులో ఉండగా.. మరోవైపు పెద్ద సంఖ్యలో ప్రైవేట్ వైద్య సేవలు, మెడికల్ షాపులు కొనసాగు తున్నాయి. మండల జనాభాతో పోల్చితే మెడికల్ షాపుల సంఖ్య పై స్థానికంగా చర్చ జరుగు తోంది.చర్ల మండలంలో మెడికల్ షాపు లు పదిహేడు మంది ఆర్ఎంపీలకు ఉన్నట్లు స్థానికంగా అందిన వివరాలు చెబు తున్నాయి. వ్యక్తిగత మెడికల్ షాపులు సుమారు 30,వీటికి తోడు మేడిప్లస్ ఒకటి, అపోలో ఒకటి కలిపి మొత్తం 32 మెడికల్ షాపులు ఉన్నట్లు సమాచారం.అయితే ఈ సంఖ్యలన్నింటినీ సంబంధిత అధికారులు ధ్రువీకరించాల్సి ఉంది. 42,947 మంది జనాభా..2011 జనగణన ప్రకారం చర్ల మండల జనాభా 42,947. ఇందులో 21,167 మంది పురుషులు, 21,780 మంది మహిళలు ఉన్నారు.మొత్తం 11,091 కుటుంబాలు నమోదయ్యాయి.

ప్రస్తుతం జనాభా పెరిగి ఉండే అవకాశం ఉన్నప్పటికీ, కొత్త జనగణన అధికారిక గణాంకాలు అందుబాటు లోకి వచ్చే వరకు 2011 గణాంకాలనే ప్రామాణికంగా పేర్కొనాల్సి ఉంటుంది. మూడు ప్రభుత్వ వైద్య కేంద్రాలు చర్లలో 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) ఉంది.తెలంగాణ వైద్య విధాన పరిషత్ అధికారిక వివరాల ప్రకారం చర్ల సీహెచ్‌సీ 30 పడకల ఆసుపత్రిగా పనిచేస్తోంది. అదేవిధంగా కోయ్యూరు పీహెచ్‌సీ, సత్యనారాయణపురం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం వంటి ప్రభుత్వ వైద్య సదుపాయాలు కూడా మండల పరిధిలో ఉన్నాయి. ఇన్ని షాపులకు వ్యాపారం ఎలా..? మండల జనాభా సుమారు 43 వేలుగా ఉన్న సమయంలో 32 మెడికల్ షాపులు కొనసాగు తుండటం పై ప్రజల్లో సహజంగానే ప్రశ్నలు తలెత్తుతు న్నాయి. రోజుకు ఒక్కో మెడికల్ షాపుకు ఎంతమంది వినియోగదారులు వస్తున్నారు. ప్రభుత్వఆసుప త్రుల్లో వైద్యం పొందుతున్న వారి సంఖ్య ఎంత ప్రైవేట్ వైద్యం, ఆర్ఎంపీల వద్ద చికిత్స పొందుతున్న వారి సంఖ్య ఎంత.. మండలానికి బయట నుంచి చర్లకు వైద్యం కోసం ఎంతమంది వస్తున్నారు.

అన్ని మెడికల్ షాపులకు చట్టబద్ధమైన అను మతులు ఉన్నాయా..? షాపుల్లో ఫార్మసిస్ట్ అర్హతలు, లైసెన్సులు నిబంధనల ప్రకారం ఉన్నాయా..? వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా మందుల విక్రయాలు జరుగుతున్నాయా? అనే అంశాలపై సంబంధిత వైద్య, ఔషధ నియంత్రణ అధికారులు తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నా రు.ఆదాయంపై అధికారిక పరిశీలన అవసరం 32 మెడికల్ షాపులు ఉన్నాయన్న లెక్క ఒక్కటే చూసి అవి అక్రమంగా లేదా నష్టాల్లో ఉన్నాయని చెప్పడం సరికాదు. మెడికల్ షాపుల టర్నోవర్, రోజువారీ విక్రయాలు, లైసెన్సులు, ప్రిస్క్రిప్షన్ ఆధారిత విక్రయాలు, ప్రభుత్వ ఆసుపత్రుల ఓపీ వివరాలు పరిశీలించిన ప్పుడే వాస్తవ పరిస్థితి బయటపడుతుంది. చర్ల మండలంలో వైద్య సేవలపై సమగ్ర సర్వే నిర్వహించి.. ప్రభుత్వ వైద్యం, ప్రైవేట్ వైద్యం, మెడికల్ షాపుల పరిస్థితిపై అధికారిక గణాంకాలను ప్రజల ముందుం చాలని స్థానికులు కోరుతున్నారు.

## నకిలీ వాట్సాప్ సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలి - కలెక్టర్ హేమంత్ భోర్ఖడే సహదేవరావు

**ములుగు, యువ వెలుగు, అక్టోబర్ 6 :** తన పేరు, ఫోటోను ఉపయోగించి గుర్తుతెలియని వ్యక్తులు పంపుతున్న నకిలీ వాట్సాప్ సందేశాలకు ఎవరూ స్పందించవద్దని జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు తెలిపారు.తన ఫోటోను వాట్సాప్ డీపీలో పెట్టుకుని o66 98 476 2993 నంబర్ నుంచి అధికారులకు సందేశాలు పంపుతున్నట్లు గుర్తించామన్నారు. ఈ నంబర్ నుంచి వచ్చే సందేశాలను నమ్మవద్దని, వెంటనే బ్లాక్ చేసి వాట్సాప్ లో ఫిర్యాదు చేయాలని సూచించారు. పేరు, ఫోటో కనిపించినంత మాత్రాన అపరిచిత నంబర్ల నుంచి వచ్చే సందేశాలను విశ్వసించవద్దని స్పష్టం చేశారు. డబ్బులు, బహుమతి కార్డులు అడిగినా స్పందించవద్దని, వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, రహస్య సంకేత సంఖ్యలను ఎవరికీ ఇవ్వవద్దని కోరారు. అనుమానాస్పద సందేశాలు వస్తే సైబర్ నేరాల విభాగం పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు.

## చలో ఉస్మానియా యూనివర్సిటీ

**పద్మ శ్రీ మందకృష్ణ మాదిగ అన్న పిలుపు మేరకు బాన్సువాడ నియోజకవర్గ ఇంఛార్జ్ సోంపూర్ పోచిరాం మాదిగ ఆధ్వర్యంలో బాన్సువాడ నియోజకవర్గ వివిధ మండలాల నుంచి ఉస్మానియా యూనివర్సిటీకీ యువ నాయకులు**



**కోటగిరి/పోతంగల్, యువ వెలుగు, అక్టోబర్ 6 :** సమాజ అభివృద్ధి విద్యతోనే సాధ్యమని, విద్యారంగంలోని సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వాల దృష్టికి పోరాటాల రూపంలో ముందుకు తీసుకెళ్లే విధంగా కార్యాచరణలో భాగంగా.. విద్యార్థి నాయకత్వాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఈ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందనీ నియోజకవర్గ ఇన్చార్జి ఎంఆర్పిఎస్ నాయకులు పోచీరం తెలిపారు. అందులో భాగంగా బాన్సువాడ నియోజకవర్గం నుంచి భారీగా మీాఖీ విద్యార్థి యువ నాయకులు, కోటగిరి పోతంగల్ మండలాల సోదరులు నేర్రోళ్ళ అశోక్ మాదిగ, పోశెట్టి మాదిగ సీనియర్ నాయకులు నాగయ్య, N.హరిదాస్ మాదిగ, G.నవీన్ మాదిగ, సంతోష్ మాదిగ, నాగేష్ మాదిగ, వినోద్ మాదిగ, గణేష్ మాదిగ, నర్సింలు మాదిగ, నితిన్ మాదిగ నాయకులు చలో ఉస్మానియా కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి బయలుదేరారు.

## ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడి బాధ్యతల నుండి ఇరిగి శ్రీను సస్పెన్షన్



**తిరుమలగిరి (సాగర్), యువ వెలుగు, అక్టోబర్ 6 :** ఇటీవల కాలంలో ఎమ్మార్పీ ఎస్ తిరుమలగిరి సాగర్ మండల నూతన అధ్యక్షునిగా ఎన్నికైన ఇరిగి శ్రీను ఎమ్మార్పీఎస్ పేరుతో అక్రమాలకు పాల్పడుతున్నట్లు నేర ఆరోపణతో అరెస్ట్ అయిన విషయం ఎమ్మార్పీఎస్ జిల్లా కమిటీ దృష్టికి రావడం వల్ల వారిని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుని బాధ్యతల నుండి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్చార్జ్ కోళ్ల శివ మాదిగ మంగళవారం పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ పేరుతో అక్రమాలకు గాని బెదిరింపులకు గాని పాల్పడితే వారు ఎంతటి వారైనా ఎమ్మార్పీఎస్ సహించబోదని క్రమశిక్షణ చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.అదే విధంగా త్వరలో తిరుమలగిరి మండలం ఎమ్మార్పీఎస్ నూతన అధ్యక్షుని నియామకం ఉంటుందని తెలిపారు.

## పట్టభద్రులంతా ఓటు నమోదు చేసుకోవాలి

**- గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్**



**ములుగు, యువ వెలుగు, అక్టోబర్ 6 :** రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవి చందర్ అన్నారు. రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు సోమవారం జిల్లా గ్రంథాలయ కేంద్రంలో పాఠకులు, నిరుద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు లేని వారు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. మంచి నాయ కులను, సమాజానికి ఉపయోగపడే వారిని ఎన్నుకునే విధంగా ఆలోచించాలని పాఠకులు, విద్యార్థులు, నిరుద్యోగులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎత్తొండ పీఏసీఎస్ చైర్మన్‌గా కోనేరు వెంకట సుబ్బారావు ప్రమాణ స్వీకారం

**నూతన చైర్మన్‌తో సంఘ సభ్యులకు ప్రమాణం చేయించిన.. పర్సనల్ ఇన్ ఛార్జ్ రియాజుద్దీన్**



**కోటగిరి మండలం, యువ వెలుగు, అక్టోబర్ 6 :** కోటగిరి మండలం ఎత్తొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన పాలకవర్గం మంగళవారం అట్టహాసంగా కొలువు దీరింది.సంఘ చైర్మన్‌గా కోనేరు వెంకట సుబ్బారావుతో పాటు మరో 12 మంది పాలకవర్గ సభ్యులతో సంఘం పర్స న్ ఇన్ ఛార్జ్ రియాజుద్దీన్ ప్రమాణ స్వీకారం చేయించా రు.ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సంఘం నూతన చైర్మన్‌తో పాటు పాలకవర్గ సభ్యులుగా కమలావార్ వెంకటేష్, మన్నె సాయిలు, అగ్గు హనుమంతు, మేతరి లస్మవ్వ, బొనిగే శ్యాంసుందర్, ఆలపాటి లక్ష్మి, జి.సరస్వతి, జి.తుక్కమ్మ, ఆర్.రాధిక, బోధన్ ఆనంద్, ఎం. ఫణికుమార్, హెచ్.అశోక్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సంఘం పరిధిలోని సర్పంచులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, సహకార సంఘం సిబ్బంది నూతన పాలక వర్గానికి శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం గత కొంతకాలంగా సంఘం పర్సనల్ ఇన్ ఛార్జ్‌గా సేవలందించిన రియాజుద్దీన్‌ను నూతన పాలకవర్గ సభ్యులు శాలువా, పూలమాలలతో సత్కరించారు.ఈ సందర్భంగా నూతన చైర్మన్ కోనేరు వెంకట సుబ్బారావు మాట్లాడుతూ.రైతు బాగుంటేనే దేశం బాగుంటుందనే నమ్మకంతో మా పాలక వర్గం పనిచేస్తుంది అని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ ఆనంద్ మాట్లాడుతూ.. సంఘం ద్వారా రైతులకు కాలానికి అనుగుణంగా అందవలసిన రుణాలు, ఎరువులు, విత్తనాలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా పంపిణీ చేయాలన్నారు. అర్హులైన ప్రతి రైతుకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. బాన్సువాడ ఎమ్మెల్యే, రాష్ట్ర వ్యవసాయ శాఖ ముఖ్య సలహాదారులు పోచారం శ్రీనివాసరెడ్డి అండదండలతో ఎత్తొండ సహకార సంఘాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేసి లాభాల బాటలో నడిపించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంఘ పరిధిలోని సర్పంచులు రొట్టె పుష్పభాయి విఠల్, ఎస్.కె.గౌస్, గైని వీరమణి అర్జున్, బి.అనిత చందు, ప్రజాప్రతినిధులు, సంఘ సభ్యులు, రైతులు, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

**Editor P. Mahesh Goud,** Rachakonda printer's & publication's, Sri balaji printing press, H.No:-5-2-396, Venkateshwara colony, saheb nagar, Rangareddy, 500070
PRGI: TGTEL /26/A6429 office address : #5-4-183, Twin city towers complex, Abids, Hyd-500001, TG. yuvavelugu@gmail.com. Contact number : **9908 502 602**